క్లుప్తంగా

భూముల రీ సర్వేకు శ్రీకారం



అల్లిపూడిలో సర్వే చేస్తున్న ప్రతినిధులు

కోటనందూరు: 'జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష' పథకంలో భాగంగా అల్లిపూడిలో మంగళవారం భూముల రీ సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టారు. తహసీల్దార్ ఎల్.శివకుమార్ ఆధ్వర్యంలో సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు మస్తాన్, జాన్వేష్, స్థానిక మండల సర్వేయర్ కె.దాలిరాజు గ్రౌండ్ కంట్రోలింగ్ పాయింట్(జీసీపీ)లను గుర్తించారు. మండలంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో జీసీపీలను గుర్తించిన తరువాత డ్రోన్‌లతో రీ సర్వే చేపడతామని మండల సర్వేయరు దాలిరాజు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, విలేజ్ సర్వేయర్ శ్రీను పాల్గొన్నారు.

భద్రాచలానికి బస్సు సర్వీసు

తుని: శ్రీరామ నవమి కల్యాణోత్సవాలను పురస్కరించుకొని భద్రాచలానికి తుని నుంచి బస్సు నడుపుతున్నామని డిపో మేనేజరు ఎస్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటలకు తుని డిపో నుంచి అల్ట్రా డీలక్స్ బయలుదేరుతుందన్నారు. టికెట్లు కావాల్సిన ప్రయాణికులు సర్వీస్ నంబరు 98394కు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

తుని రూరల్: డి.పోలవరం శివారు సుభద్రయ్యమ్మపేటలో ఓ వ్యక్తి పాము కాటుకు గురైన మృతి చెందినట్టు రూరల్ ఎస్సై ఎ.బాలాజీ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామానికి చెందిన కొండపల్లి నాగేశ్వరావు(52) నెల రోజులు కిందట పొలం పనులు చేసేందుకు సుభద్రయ్యమ్మపేట వచ్చాడు. మొక్కజొన్న తోటలో పనులు చేస్తుండగా పాము కాటేసింది. స్థానికులు వెంటనే కాకినాడ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ నాగేశ్వరరావు మృతి చెందినట్టు వివరించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బాలాజీ వివరించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటనందూరు: అల్లిపూడి కేజీబీవీలో 6వ, 11వ తరగతులు, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రత్యేకాధికారి జి.రాజేశ్వరి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏఎస్ఎం(ఎంపీహెచ్‌డబ్ల్యూ)కి 40, 6వ తరగతికి 40, 7వ తరగతిలో ప్రవేశాలకు 4 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పాఠశాలలో చేరేందుకు అనాథలు, బడి మానేసిన పిల్లలు, బడి బయట పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే అర్హులన్నారు. ఏప్రిల్ 20 వరకూ కేజీబీవీ పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందని ఎస్ఓ రాజేశ్వరి వివరించారు.

బీజేపీ తుని కన్వీనర్, కో కన్వీనర్ల నియామకం

తుని రూరల్: బీజేపీ తుని నియోజకవర్గ కన్వీనర్, కో కన్వీనర్లగా తమను నియమించినట్టు తొండంగి మండలం బెండపూడికి చెందిన వెలుగుల గోపాలకృష్ణ, కోటనందూరు మండలం కె.ఈ.చిన్నయ్యపాలెంకు చెందిన లాలం లోవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి మంగళవారం సమాచారం అందినట్టు పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచనలతో రాష్ట్ర అధ్యక్షుడు తమను నియమించారన్నారు. కన్వీనర్, కో కన్వీనర్లను జాతీయ ఉద్యాన బోర్డు మాజీ డైరెక్టర్ చోడ్రాజు సత్యకృష్ణంరాజు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామ్‌కుమార్, నియోజవర్గ నాయకులు ప్రగడ ఈశ్వరరావు, ప్రగడ చక్రరావు, జీను బాబ్జి శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట కన్వీనర్‌గా కృష్ణవర్మ

జగ్గంపేట: బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా దాట్ల కృష్ణవర్మ నియమితులయ్యారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు రాష్ట్రంలోని పార్టీ కన్వీనర్లు, కో కన్వీనర్లను నియిమించారని కృష్ణవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం బీజేపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగుతుండగా తనకు జగ్గంపేట కన్వీనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు.

కళాశాలలో కంప్యూటర్ సామగ్రి చోరీ

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో ప్రైవేటు కళాశాలలో కంప్యూటర్ సామగ్రి, సీసీ కెమేరాలు చోరీపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై యూవీ శివనాగబాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. రంపచోడవరానికి చెందిన త్రిరివీధి వెంకట వీరబ్రహ్మ రాజేంద్రప్రసాద్ చెందిన శ్రద్ధ కాలేజ్ ఆఫ్ డిప్లమో ఇన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 27న రాత్రి కొంత మంది వ్యక్తులు దొంగతనం చేశారు. కళాశాలకు వచ్చి కార్యాలయం గదిలోని సీసీ కెమెరీ, డీవీఆర్, ల్యాప్‌టాప్‌లు అపహరించి, కొన్ని ఫైల్స్‌ను తగలబెట్టారు. దీనిపై రాజేంద్రప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పరీక్షలకు వేళాయె..

- సిద్ధమవుతున్న టెన్త్ విద్యార్థులు
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



కిర్లంపూడి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఉపాధ్యాయుడు

కిర్లంపూడి: పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడింది. విద్యార్థులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సందేహాలు నివృత్తి చేసుకుంటూ, అన్ని సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకొని వచ్చేనెల 3వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సుమారు 953 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కరోనా కారణంగా రెండేళ్లు వివిధ తరగతులు, పరీక్షలకు దూరమైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రెండేళ్లు రాతకు దూరమైన విద్యార్థులకు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరిల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువుతో పాటు రాతపై కూడా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

ఒత్తిడిని పోగొట్టేలా..

పరీక్షలపై పదో తరగతి విద్యార్థుల్లో ఎటువంటి భయాందోళనలు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ప్రతిరోజూ ఒక సబ్జెక్ట్‌కు రెండు పిరియడ్లు కేటాయించి మొదటి అవర్ చదివించి, రెండో అవర్ పరీక్ష పెడుతున్నారు. విద్యార్థులకు ప్రతిరోజు రివిజన్ టెస్టులు, వీకెండ్ టెస్టులు, ఎఫ్ఏ టెస్టులు నిర్వహించి పరీక్షల ఒత్తిడిని పోగొట్టేలా ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. పరీక్షల్లో అన్నీ సరైన సమాధానాలు రాసేలా ప్రత్యేక తరగతుల్లో శిక్షణ ఇచ్చారు. ఎప్పటికప్పుడు డీవైఈఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ టి.జోసఫ్ ఆయా పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

చేతిరాత బాగుంటే మంచి మార్కులు

పరీక్షల్లో ఇచ్చే ప్రశ్నపత్రాన్ని బాగా చదివి, తెలిసిన పశ్నలకు సమాధానం రాయాలి. అక్షరాలు పొందిగ్గా, క్రమపద్ధతిలో రాస్తే మంచి మార్కులు పడతాయి. సమాధానపత్రంలో 16 నుంచి 20 లైన్లు ఉండేలా చూసుకోవాలి. పదానికి పదానికి మధ్య దూరం, వరసలకు అవసరమైనంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి. చేతిరాత బాగుంటే సమాధాన పత్రాలు దిద్దే సమయంలో సదరు ఉపాధ్యాయులు ఇబ్బంది లేకుండా అన్నింటినీ బాగా చదివి మార్కులు వేసే అవకాశం ఉంటుంది. గజిబిజిగా తప్పుల తడకగా సమాధాన పత్రం ఉంటే దిద్దేవాళ్లకు విసుగ్గా ఉంటుంది. అందుకే అక్షరాలు పొందిగ్గా రాసేలా ముందే ప్రిపేర్ అవ్వాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల విద్యార్థులకు సూచించారు.

జగ్గంపేట నియోజకవర్గంలో పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, పరీక్షా కేంద్రాల వివరాలు మండలాల వారీగా..

మండలం	విద్యార్థులు	పరీక్షా కేంద్రాలు
కిర్లంపూడి	953	5
జగ్గంపేట	1370	6
గోకవరం	1010	5
గండేపల్లి	521	3
మొత్తం	3854	19

ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు



పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రశ్నపత్రాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఏ విధంగా చదవాలో మెళకువలు చెబుతున్నారు. ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా శిక్షణ ఇస్తున్నారు. పరీక్షల్లో ఏ ప్రశ్నలకు సమాధానాలు రాయాలనేదీ వివరిస్తున్నాం. ఉత్తమ ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం.

– ఆకుల శ్రీనివాసరావు, హెచ్ఎం, కిర్లంపూడి హైస్కూలు

పరీక్షలకు సిద్ధం



పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తరగతులకు రోజూ హాజరవుతున్నాను. పరీక్ష పేపరు నమూనాలపై అవగాహన పెంచుకుంటున్నాను. మా ఉపాధ్యాయులు చెప్పినవన్నీ గుర్తు పెట్టుకొని పరీక్షలు బాగా రాస్తాను. ఇప్పటికే అన్ని సబ్జెక్టలను చదివి అవగాహన పెంచుకున్నా, పరీక్షలు సిద్ధంగా ఉన్నాను.

– బొడ్డేటి వెంకట నాగ సుభాష్, కిర్లంపూడి హైస్కూలు

సందేహాల నివృత్తి



ప్రతిరోజూ ప్రత్యేక తరగతు లు నిర్వహిస్తున్నారు. చదువుతున్నప్పుడు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. తెలుగు, లెక్కలు, సైన్స్, సోషల్ అన్నింటిపై మంచి అవగాహన వచ్చింది. మంచి మార్కులు తెచ్చుకుంటాను అనే నమ్మకం ఉంది. పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నాను.

– బాలెం శ్రావణి, తామరాడ హైస్కూలు

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక



సీకోలు దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికై నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గోపాలకృష్ణ తెలిపారు. గత నెల 5వ తేదీన జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు హాజరుకాగ వారిలో 8వ తరగతి చదువుతున్న సీకోలు దుర్గా ప్రసాద్ ఉపకార వేతనం పొందడానికి అర్హత సాధించాడు. ప్రతిభ కనబరచిన విద్యార్థి దుర్గా ప్రసాద్‌ను, పాఠశాల ఉపాధాయులను ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు అభినందించారు.

నేడు బైక్ ర్యాలీ

గండేపల్లి: భద్రాచలంలో గురువారం జరగనున్న సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు బుధవారం భక్తులు బైక్ ర్యాలీగా తరలివెళ్లనున్నారు. అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కమలేష్ దాస్ మహారాజ్, జాతీయ కార్యదర్శి యోగి అతిథేశ్వరానందేశ్వర స్వామి, ఏపీ ఉపాధ్యక్షులు రాజరాజేశ్వరానంద స్వామి, కార్యదర్శి గీతాప్రకానంద స్వామిజీ పాల్గొని ఈ ర్యాలీని ప్రారంభిస్తారని అఖిల భారత హిందూ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు, తాళూరి మఠాధిపతి పాడుగు వెంకట సత్యనారాయణ ప్రసాద్ ఆచార్యులు మంగళవారం తెలిపారు. అఖిల భారత హిందూ మహాసభ, పరవస్తు అరుఘయ మణవాళ జియ్యరు స్వామి(తాళ్లూరి జియ్యన్న) మఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



రాతులపూడిలో ఆసరా చెక్కు మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్



కిర్లంపూడిలో ఆసరా చెక్కు మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ

కిర్లంపూడి: మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట శాసన సభ సభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం స్థానిక సత్యదేవా కల్యాణ మండపం వద్ద ఎంపీపీ తోట రవి అధ్యక్షతన నిర్వహించిన మూడో విడత వైఎస్సార్ ఆసరా(రుణమాఫీ) కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చంటిబాబు హాజరై ఆసరా నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మూడో విడతగా వైఎస్సార్ ఆసరా విడుదల చేశారన్నారు. మండలంలోని వైఎస్సార్ క్రాంతి పథంలో ఉన్న 1776 డ్వాక్రా గ్రూపులలో 17761 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.15.81 కోట్లను తమ ఖాతాలలో జమ చేశారన్నారు. అనంతరం ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చేయూత మహిళా మార్ట్‌ను చంటిబాబు పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దోమాల గంగాధర్, గ్రామ సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబి, వైస్సార్ సీపీ నాయకులు తోట గాంధీ, పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు బిళ్ళకుర్తి నాగమణి, మొల్లేటి సరస్వతి, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, తహసీల్దార్ కేవీ మాధవరావు, ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సర్కారు లక్ష్యం : ఎమ్మెల్యే పర్వత

రౌతులపూడి: మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలంలోని 793 మహిళా సంఘాలకు రూ.5.15 కోట్ల చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని కుటుంబాలకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూతతో మహిళలు సొంత వ్యాపారాలు పెట్టి ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. ఈ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని, ఆయన అందరం అండగా ఉండాలని చెప్పారు. అనంతరం మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల వైస్ ఎంపీపీ సూరెడ్డి సాయి, మండల వ్యవసాయ సలహా 95 కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, డీసీపీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ కటారి అర్జనమ్మ, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్ వీవీ సత్యనారాయణ, మండల పార్టీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, రాంకుర్తి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- శంఖవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం

శంఖవరం: ప్రజల మెచ్చిన పాలన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. కరోనా కష్ట కాలంలోనూ రైతు భరోసా, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న కాలంలో ఈ పథకాలన్నీ అమలవాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, సర్పంచ్ చింతనీడి కుమార్, ఆడపా వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు పర్వత స్వామి తదితరులు పాల్గొన్నారు.



శంఖవరంలో మహిళలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం కొండపైకి ఆటోలు తిరిగేందుకు అనుమతి లభించడంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు ఆటోవాలాలు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఇటీవల కొండపైకి ఆటోలను అధికారులు నిషేధించారు. దీనిపై ఎమ్మెల్యే చొరవ తీసుకొని రత్నగిరి అధికారులతో చర్చించి కొండపైకి ఆటోలు రాకపోకలకు అనుమతించేలా చేశారు. దీంతో వారు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేదాంత సభలు



ముంగిపు రోజున ఆధ్యాత్మిక ప్రసంగిస్తున్న ఆశ్రమ ప్రతినిధి తిరుపతిరావు

ఏలేశ్వరం: సిరిపురంలోని చిద్గగానందా గీతాశ్రమంలో 49వ భక్తి, జ్ఞాన వేదాంత మహాసభలు మంగళవారంతో ముగిశాయి. విజయనగరం జిల్లా గంగచోళ్లపెంట జ్ఞానానంద గీతాశ్రమం పీఠాధిపతి యోగానందా భారతీస్వామి ఆధ్వర్యంలో వేదాంత మహాసభలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సభలకు పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు హాజరయ్యారు. ముగింపు రోజున గురుదేవుడు చిద్గగానందా స్వామి చిత్రపటాన్ని ఊరేగింపు, ఆశ్రమ వ్యవస్థాపకుడు అచ్యుతానందా స్వామివారి శిలావిగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం గీతాయజ్ఞం, పూర్ణాహుతి జరిపారు. ఈ యజ్ఞాన్ని గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, గునిమానికల వెంకటరమణ, అనపర్తి సూర్యనారాయణమూర్తి, ఆకుల హరిబాబు దంపతులు నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి దయానందా భారతీస్వామి ఏర్పాట్లు పర్యవేక్షించారు. లక్ష్మీనర్సాపురం ఆశ్రమం నుంచి సూర్యనందగిరి, దయానందస్వామి, శ్రీహరిహర క్షేత్రం పీఠాధిపతి పరమనందగిరి స్వామి, రాచపల్లి ఆశ్రమ పీఠాధిపతి రామానందస్వామి వేదాంతమహసభల్లో అధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చారు. మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో అశ్రమ ప్రతినిధులు నడిశెట్టి తిరుపతిరావు, పాలమూరి పెదకాపు, యల్లపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశుగణాభివృద్ధికి ఎన్నో పథకాలు



పోటీలో గెలిచిన లేగదూడలతో రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు

జగ్గంపేట: పశుగణాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోందని పశుగణాభివృద్ధి సంస్థ డీడీ డాక్టర్ అంబేద్కర్ అన్నారు. బలభద్రపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన లేగ దూడల అందాల పోటీలు, ఆడ దూడల అభివృద్ధి పథకం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆడదూడల అభివృద్ధి పథకం గురించి వివరించారు. లేగ దూడల పోటీల్లో విజేతలైన రైతులకు బహుమతులు అందచేశారు. లేగ దూడల అందాల పోటీలకు 30 ఆవుదూడలు, 7 గేదె దూడలు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట పశుసంవర్ధక శాఖ ఏడీ ఎస్.సత్యనారాయణ, కాట్రావులపల్లి పశువైద్యులు వినోద్‌కుమార్, గుర్రంపాలెం గ్రామ సర్పంచి చీపురుపల్లి లక్ష్మి రాఘవ, బలభద్రపురం ఎంపీటీసీ సభ్యులు సిదిరి సత్తిబాబు, గుర్రంపాలెం, బలభద్రపురం రైతులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



ఏలేశ్వరంలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, విద్యార్థులు

ఏలేశ్వరం: ఏడాదంతా చదువుతో అలిసిపోయిన విద్యార్థులు మంగళవారం రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలతో ఆకట్టుకున్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఫేర్‌వేల్ పార్టీ నిర్వహించారు. దీంతో టెన్త్ విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి విద్యార్థులతో కలిసి సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు సరస్వతీదేవి కటాక్షం ఉండాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, వాగు బలరామ్, యండగండి నాగబాబు, కాకాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల తొలగింపు

తొండంగి: స్థానిక మెయిన్ సెంటర్ నుంచి నంది సెంటర్‌కు వెళ్లే రహదారిలో రోడ్డుపై రాకపోకలకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపునకు విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. తొండంగిలో పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణ పనులు జరిగాయి. ఈనేపథ్యంలో రహదారి వెడల్పు చేయడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు రోడ్లపై ఉండిపోయాయి. విద్యుత్ లైన్ల కారణంగా వాటి మార్పునకు అంతరాయం ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్ స్తంభాల తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఈమేరకు విద్యుత్ శాఖ లైన్‌మేన్ కొలాన రాంబాబు, ఇతర సిబ్బంది స్తంభాలను తొలగించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ
- నడిపల్లి రాము కుటుంబ సభ్యులకు పరామర్శ



రాము కుటుంబ సభ్యులను పరామర్శించిన కృష్ణమాదిగ

తొండంగి: శృంగవృక్షం గ్రామ దేవత జాతరలోని జరిగిన ఘర్షణలో దాడి కారణంగా మృతి చెందిన నడిపల్లి రాము కుటుంబంతోపాటు బాధితులకు అండగా ఉంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం తొండంగిలో నడపిల్లి రాము కుటుంబ సభ్యులను పరామర్శించారు. జరిగిన సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. శృంగవృక్షంలో గాయపడిన బాధితులను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ వారికి మద్దతుగా ఉంటామన్నారు. సమిష్టిగా పోరాడుతామన్నారు. అనంతరం శృంగవృక్షం, గోపాలపట్నం గ్రామాల్లో అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాసా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు సోనీవుడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకాడ నూకరాజు, ఉమ్మడి జిల్లాల ఉద్యోగ సంఘం అధ్యక్షుడు తాతపూడి వెంకటేష్, ఎమ్మార్పీఎస్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పలివెల సతీష్, తుని నియోజకవర్గం అధ్యక్షుడు పలివెల శివమణి, ఎమ్మార్పీఎస్ తొండంగి మండల అధ్యక్షుడు పలివెల సాయి, పెదపాటి రమేష్, తదితరుల ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: గ్రామాల్లో సంభవించే సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ తోట రవి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి పీహెచ్‌సీల వైద్యులు, ఆసుపత్రుల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు ఎల్లప్పుడూ ఆసుపత్రుల్లో రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తోట గాంధీ, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎంఏసీ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, ఎంపీడీఓ బి.ప్రసాద్‌బాబు, మండల సచివాలయాల కన్వీనర్ పెనగంటి రాజేష్, వైద్యులు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో ఎమ్మెల్యే పర్యటన

గోకవరం: మండల కేంద్రమైన గోకవరంలో బుధవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఫ్యామిటీ ఫిజీషియన్ వాహనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం స్థానిక గుబ్బాలమ్మ ఆలయం వద్ద జరిగే అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ఆదిత్యలో ప్రాజెక్ట్ ఎక్స్పో ఈవెంట్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో మంగళవారం ప్రాజెక్ట్ ఎక్స్పో ఈవెంట్ నిర్వహించిట్టు విభాగాధిపతి ప్రీతం కుమార్ దాస్ తెలిపారు. 57 బృందాలుగా పాల్గొన్న విద్యార్థులు పోస్టర్ నమూనా ద్వారా ప్రదర్శించిన మూడు ప్రాజెక్ట్‌ను ఎంపిక చేసి ఎగ్జిబిషన్ నిర్వహించినట్టు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామార్థ్యాన్ని ఆవిష్కరించడం, పరస్పరం ఆలోచనలు పంచుకోవడానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, వివిధ విభాగాల డీన్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీ విచారణ సమగ్రంగా చేపట్టాలి

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో సుందరమ్మ సత్రానికి సంబంధించిన 89 ఎకరాల భూమిపై జేసీ సమగ్ర విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన రంపయర్రంపాలెం గ్రామంలో ఆయన మాట్లాడుతూ సత్రం భూముల విషయంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయగా ఈనెల 29న జాయింట్ కలెక్టర్ విచారణ నిర్వహిస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ఈ విచారణను న్యాయబద్ధంగా జరిగితే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

వైభవంగా పాదాలమ్మతల్లి జాతర

కోటనందూరు: కాకరాపల్లిలో శ్రీపాదాలమ్మతల్లి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పండితులు ప్రత్యేక పూజలు చేసారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. గ్రామ ప్రజలు, గ్రామ పెద్దల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చిన్నారులు ఇచ్చిన కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఏలేశ్వరం: గ్రామస్థాయి నుంచి బీజేపీని బలోపేతానికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి వై.మాలకొండయ్య అన్నారు. సిరిపురం గ్రామంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అసెంబ్లీలో దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని తీర్మానం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఓట్ల బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, దాకేకృష్ణారావు, గున్నాబత్తుల రాజబాబు, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.